క్లుప్తంగా

నేడు విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

జడ్చర్ల టౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు బుధవారం మండలంలో విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఏబీవీపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు సాయికుమార్ తెలియజేశారు. బంద్‌కు విద్యాసంస్థలు సహకరించాలని కోరారు.

పశువుల సంత వేలం రూ.9.16 లక్షలు

మిడ్జిల్: మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే వారాంతపు పశువుల సంతకు మంగళవారం పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన పల్లె అరవింద్ రూ.9.16లక్షలకు దక్కించుకున్నట్లు కార్యదర్శి సాయన్న తెలిపారు. తైబజారు (కూరగాయల సంత) కొన్ని అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్, ఎంపీటీసీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు

జడ్చర్ల టౌన్: మండలంలోని ఈర్లపల్లిలో 8ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థ నుంచి విడిపించాలని కోస్గి వెంకటయ్య మంగళవారం రాష్ట్ర ప్రజావాణికి ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ స్థలం కొనటం, అమ్మటం నిషేధం అయినప్పటికీ 2016లో ఓ సంస్థకు చెందిన వారు కొనుగోలు చేసి ఆర్‌ఓఆర్‌లో మార్పులు చేసుకుని ఫాంల్యాండ్ ఏర్పాటు చేసి గుంటలలో విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పొందుపర్చారు.

చైతన్యవేదిక జిల్లా అధ్యక్షురాలి ఎంపిక

మహబూబ్‌నగర్ రూరల్: బీసీ, ఎస్సీ, ఎస్టీ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షురాలిగా బాదం సుజాతను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు హరినాథ్ మంగళవారం తెలిపారు. జిల్లా బాధ్యతలు అప్పగించినందుకు సుజాత ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా పోలేరమ్మ ఉత్సవాలు

మక్తల్: మండలంలోని భూత్పుర్, కాట్రేవ్‌పల్లి గ్రామాల్లో పోలేరమ్మ బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు పవిత్ర కృష్ణానీటిని తీసుకొచ్చి అమ్మవారికి పుష్కర స్నానంచేయించి పూజలు చేశారు. వివిధ గ్రామాల్లో పోలేరమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు.

నర్వ: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం పోలేరమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాల పండుగను ప్రజలు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. యాంకి చెరువు కట్టపై వెలిసిన పోలేరమ్మ ఆలయానికి లంకాల్ నుంచి మహిళలు పోటెత్తారు. ఈ మేరకు.. మహిళ భక్తులు బోనాలతో అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా గ్రామాల్లో, పోలేరమ్మ బోనాల పండుగ సందర్భంగా తినుబండారాల దుకాణాలు వెలియడంతో జాతరను తలపించింది.

వానాకాలం పంటల సాగుపై అవగాహన



మాగనూర్: రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో మంగళవారం మాగనూర్ రైతు వేదికలో వానాకాలం పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా వానాకాలంలో వివిధ పంటల సాగు విధానం, చీడపీడల నివారణ, ఎరువుల యాజమాన్యం వంటి అంశాలపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ వారిచే వివిధ యూట్యూబ్ వీడియోలను ప్రదర్శించారు. దీంతో పాటు రైతులతో నేరుగా చర్చించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. రైతు భరోసా కార్యక్రమం ద్వారా ఆర్థిక చేయూత అందించే ఉద్దేశంతో రాష్ట్ర స్థాయిలో విధివిధానాలను రూపొందిస్తున్నారు. అందులో భాగంగా ప్రథమంగా నేరుగా క్షేత్రస్థాయిలోని రైతుల అభిప్రాయాలను సేకరించి, ఏ విధంగా రైతు భరోసా కార్యక్రమం కింద ఆర్థిక చేయూతనిస్తే, ఎక్కువ మంది రైతులకు లాభాలు చేకూరుతాయో, ఎన్ని ఎకరాల వరకు లబ్ధి చేకూరుతుందో తదితర అంశాలను క్షేత్రస్థాయిలోని రైతులతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు నాగేష్, మాగనూర్ ఏఓ సుదర్శన్‌గౌడ్, ఉట్కూర్ ఏఓ గణేష్‌రెడ్డి, మిథున్ చక్రవర్తి రైతులు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక నిరవధిక సమ్మె విరమణ

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో న్యాయమైన డిమాండ్‌ల పరిష్కారం కోరుతూ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెను మంగళవారం తాత్కాలికంగా విరమించారు. తెలంగాణ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ జీఓ నంబర్ 60 ప్రకారం కార్మికులకు పెంచిన కొత్త వేతనాలను తక్షణమే అమలు చేయాలన్నారు.

ఇళ్ల కోసం ఎదురుచూపులు



చౌక్కంపేట్‌లో డబుల్ బెడ్రూం ఇళ్లు

- ప్రారంభోత్సవం చేయకుండా కాలయాపన
- లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్

రాజాపూర్: గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేద కుటుంబాల కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించింది కాని వాటిని లబ్ధిదారులకు ఇవ్వలేదు. తమకు ఇల్లు వస్తదని ఆశపడ్డ వారికి నిరాశే ఎదురైంది. మండలంలోని చౌక్కంపేట్, రంగారెడ్డిగూడలో డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించారు. లబ్ధిదారులను ఎంపిక చేసి ఇప్పటికి వారికి అప్పగించకపోవడంతో ఇళ్ల పోకిరీలు, తాగుబోతులకు అడ్డాగా మారుతున్నాయి. చౌక్కంపేట్‌లో జీ ప్లస్2తో 32 డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించి ప్రారంభించకుండానే వదిలేశారు. దీంతో ఇళ్లు దెబ్బతింటున్నారు. అసలే వర్షాకాలం వచ్చేసింది ఇళ్లులేని పేదవారు గ్రామంలో పూరి గుడిసెలో ఉన్నవారు, తమకు ఇల్లు వస్తుందని అనుకున్న వారికి నిరాశే మిగిలింది. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైన త్వరలో అసలైన లబ్ధిదారులను గుర్తించి ఇల్లు అప్పగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇబ్బందులు పడుతున్నా..

ఇల్లులేక ఉన్న గుడిసెలోనే ఇద్దరు పిల్లలతో కాలం వెల్లదీస్తున్నా. వర్షాకాలం వచ్చింది ఉన్న గుడిసె కురుస్తున్నది. గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించారు. నాకు ఒక ఇల్లు ఇస్తారనుకున్నా కానీ పంపిణీ చేస్తలేరు. ప్రభుత్వం మాలాంటి పేదలను చూసైనా త్వరగా పంపిణీ చేయాలి.

– నవనీత, చౌక్కంపేట్

కమిటీలు వేసి పంపిణీ చేస్తాం



మహిళా సంఘాల సభ్యులతో పాటు కొందరు గ్రామస్తులతో కలిపి అసలైన లబ్ధిదారులను గుర్తించి వారు ఇచ్చిన తీర్మాణం మేరకే ఎంపిక చేస్తాం. ప్రజలు ఎవరైన డబ్బులు అడిగితే ఒక్క రూపాయి ఇవ్వకూడదు. జడ్చర్ల, మిడ్జిల్, బాలానగర్ మండలాల్లో కూడా ఇదే పద్ధతినా లబ్ధిదారులను ఎంపిక చేసి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తాం.

– అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

సమగ్రశిక్ష ఉద్యోగులను రెన్యూవల్ చేయాలని వినతి

- స్పందించిన కలెక్టర్.. 450 మందికి రెన్యూవల్ ఇస్తూ ఆదేశాలు



కలెక్టర్ వినతిపత్రం ఇస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి, ఉద్యోగులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖలో సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే రెన్యూవల్ చేయాలని కోరుతూ టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ విజయేంద్రకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈమేరకు హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్యలో సమగ్రశిక్షణ ఉద్యోగులు ఎంతో కీలకపాత్ర పోషిస్తున్నారని, ఉద్యోగాలు చేస్తున్న వారి జీవితాలు వచ్చే జీతం మీదనే ఆధారపడి ఉంటుందన్నారు. ఏప్రిల్ నెలలో వారిని రెన్యూవల్ చేయాల్సి ఉండగా ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, రెన్యూవల్ కాకపోవడంతో మే నెల వేతనం ఇప్పటికి రాలేదన్నారు. జూన్ నెల వేతనానికి సంబంధించి పేరోల్స్ మంగళవారం నాటికి ఇవ్వాల్సి ఉందని, కానీ ఇవ్వలేదన్నారు. వెంటనే చర్యలు తీసుకుని వారికి వేతనాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల రెన్యూవల్‌పై స్పందించిన కలెక్టర్ వెంటనే డీఈఓను పిలిపించి 450 మంది ఉద్యోగులను రెన్యూవల్ చేయాలని ఆదేశించారు. అందుకు సంబంధించిన ఫైల్‌పై ఆమె సంతకం చేశారు. జూన్ నెల వేతనం పేరోల్స్ కూడా వెంటనే చేసి రెండు నెలల వేతనాలు ఇవ్వాలని కోరారు.

దుకాణాల్లో కొనసాగుతున్న తనిఖీలు



జరిమానా వసూలు చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొన్ని రోజులుగా జిల్లా కేంద్రంలోని వివిధ దుకాణాలను మున్సిపల్ అధికారులు తనిఖీ చేస్తున్నారు. తాజాగా మంగళవారం షాషాబ్‌గుట్ట, నలందా ఆటోస్టాండ్, న్యూటౌన్ ప్రాంతంలోని పండ్ల దుకాణాలు, కిరాణం, మెడికల్ తదితర షాపులను పరిశీలించి 23 కిలోల నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనపరుచుకున్నారు. అలాగే కొందరి నుంచి రూ.9,500 జరిమానా వసూలు చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవీందర్‌రెడ్డి, వజ్రకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30నుంచి వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం కంచికామకోటి పీఠం పాలమూరుశాఖ 32వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 30 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు సేవా మండలి అధ్యక్షుడు శ్రీకాంత్‌శర్మ, ప్రాన కార్యదర్శి రాఘవేంద్రశర్మ తెలిపారు. ఆలయం ఆవరణలో మంగళవారం బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మొదటి రోజు 30వ తేదీన ఉదయం 8 గంటలకు శివాలయంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం అఖండ దీపాస్థాపన, సాయంత్రం 4 గంటలకు వేంకటేశ్వర దేవాలయంలో అంకురార్పణ, అగ్ని మథనం, నవగ్రహ పూజలు, నంది వాహన సేవలు ఉంటాయని తెలిపారు. అదే విధంగా వార్షిక బ్రహ్మోత్సవ రోజుల్లో శివాలయంలో సుప్రభాతసేవ, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, వేంకటేశ్వర స్వామి ఆలయంలో సుప్రభాత సేవ, యాగశాలలో ఆవాహిత దేవతాపూజలు, వేదపారాయణం, లక్ష్మీ గణపతి, గరుడ, సుబ్రహ్మణ్య, నవగ్రహ, మూలమంత్ర అనుష్టానాదులు, చండీపారాయణ, శ్రీసూక్త, పురుషసూక్త, సుందరకాండ పారాయణం, ఏకాదశ రుద్రాభిషేకాలు, విశేష కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. వచ్చే నెల 1న గజవాహన సేవ, 2న హనుమత్ వాహనం, 3న గరుడ వాహనం, 4న కామాక్షి సనాథ ఏకామ్రేశ్వరస్వామివార్లకు విశేష బిల్వార్చన, శేష వాహనం, 5న చండీహోమం, మయూర వాహనం, 6న హంస వాహనం, 7న సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవం, సింహవాహనం సేవ, 8న సుదర్శన హోమం, రథోత్సవం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రాజేశ్వర్, సుదర్శన్‌గౌడ్, గుండ వెంకటేశ్వర్లు, నందకిశోర్, వెంకట్రాములుగౌడ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతుల ఖాళీలు చూపించాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో అన్ని ఖాళీలను చూపించాలని టీపీఆర్టీయూ నాయకులు మంగళవారం డీఈఓ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఒకే ఉపాధ్యాయుడికి వేర్వేరు సబ్జెక్టుల్లో పదోన్నతి వచ్చిన నేపథ్యంలో జాయిన్ అయిన సబ్జెక్టు మినహా మిగిలిన సబ్జెక్టు ఖాళీని సీనియార్టీలో తదుపరి ఉన్న ఉపాధ్యాయుడికి కేటాయించేలా కామన్ డేట్ ఇవ్వాలని కోరారు. జిల్లాలో వెయ్యి మందికి పైగా ఎస్జీటీ ఉపాధ్యాయులు బదిలీలు కోరుకుంటున్నారని.. విడతల వారీగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సంఘం క్రమశిక్షణ కమిటీ చైర్మన్ యుగంధర్, జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, కార్యదర్శి రమాకాంత్, భూపతిసింగ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రానికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు నాగరాజు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని మంగళవారం బీఆర్‌ఎస్ నాయకుడు కేబీఆర్‌గౌడ్ పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో కుమ్మరిరాజు, కృష్ణయాదవ్, బుచ్చి, నవీన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా

చారకొండ: అదుపు తప్పి లారీ బోల్తా పడిన ఘటనలో మండలంలోని మర్రిపల్లి బస్ స్టేజి వద్ద జడ్చర్ల – కోదాడ జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం దేవరకొండ నుంచి బియ్యం లోడ్‌తో కల్వకుర్తి వైపు వెళ్తున్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొని బోల్తా పడింది. చెక్‌పోస్టులు డ్రమ్ములను ఢీకొని పక్కనే ఉన్న బస్ స్టేజీ వద్ద ఉన్న మహిళ శాంతికి డ్రమ్ములు తగిలి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. భర్త ధర్మ నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ నాగయ్య తెలిపారు.

విద్యుత్ సమస్యలు 'లోడింగ్'

- రైతులకు అందని ట్రాన్స్‌ఫార్మర్లు
- లోడ్ ఎక్కువై.. మోటార్లు నడవని పరిస్థితి నెలకొన్న వైనం
- డీడీలు కట్టి నెలలు గడుస్తున్నా ముందుకు కదలని ఫైళ్లు



మహమ్మదాబాద్‌లో అధికలోడుతో సతాయిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

మహమ్మదాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం చేసుకునేందుకు బోరుబావుల వినియోగం పైనే ఆధారపడ్డ రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లపై ఎక్కువ లోడింగ్ పడుతుండడంతో బోరుమోటార్లు సరిగ్గా నడవక నానా అవస్థలు పడుతున్నారు. మరోవైపు కొత్తగా బోర్లు వేసుకున్న రైతులు డీడీలు చెల్లించి నెలలు గడుస్తున్నా నేటికీ వారికి కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు అందలేదు. మండల పరిధిలోని గాధిర్యాల్‌లో 60 హెచ్‌పీ కెపాసిటీ గల ఓ వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు 12 మంది రైతులకు సంబంధించిన బోర్ల కనెక్షన్లు ఉండాల్సి ఉండగా దాదాపు 20కి పైగా కనెక్షన్లు ఉన్నాయి. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై అధికలోడు పడి మోటార్లు సరిగా నడవడం లేదు. దీంతో రైతులు నిత్యం అవస్థలు పడుతున్నారు.

మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో 2,841 మంది రైతులకు వ్యవసాయ బోర్లు ఉండగా... దాదాపు 1,242 ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉన్నాయి. వ్యవసాయ బోర్ల కనెక్షన్లు ఎక్కువ కావడంతో వీటిపై అధికలోడు పడుతోంది. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఎంతో మంది రైతులకు ఇలాంటి పరిస్థితి ఎదురవుతోంది. రైతులు ఎన్ని అవస్థలు పడుతున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో మొత్తం 36 మంది రైతులు డీడీలు చెల్లించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ల కోసం ఎదురుచూస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్‌లు ఇవ్వలేక పోతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

డీడీలు కట్టి ఆరునెలలైనా..



వ్యవసాయం చేసుకునేందుకు బోర్లు వేసుకున్నాం. విద్యుత్ కనెక్షన్‌కోసం దరఖాస్తులు పెట్టి డీడీలు కట్టి ఆరునెలలు గడిచిపోయింది. ఇప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్‌లు రాలేదు. దీంతో మాకు దగ్గర్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో నడిపించుకుందామంటే లోడు ఎక్కువయ్యి ఫ్యూజ్‌లు నిలబడక నిత్యం అవస్థలు పడాల్సిందే. ఇప్పటికైనా అధికారులు గమనించి త్వరగా కొత్త ట్రాన్స్‌పార్మర్ ఇస్తే బాగుంటుంది.

– శీలం గోపాల్, రైతు, గాధిర్యాల్

త్వరలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లు..

మహమ్మదాబాద్ మండల వ్యాప్తంగా ఆయా గ్రామల్లో కొంతమంది రైతులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ల కోసం డీడీలు కట్టి దరఖాస్తులు పెట్టుకున్నారు. ఎన్నికల కోడ్‌వల్ల కొంత ఆలస్యం అయినా త్వరగా అర్హులైన రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– సత్యం, ఏఈ, మహమ్మదాబాద్

కానిస్టేబుళ్లకు ఎస్పీ అభినందన



ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాకేంద్రంలోని న్యూటౌన్ పాన్ షాప్ దగ్గర ఈ నెల 21న రాత్రి ఓ వ్యక్తిపై యువకులు కత్తులో చేస్తున్న దాడిని అడ్డుకోవడంలో ధైర్య సాహసాలు కనబరిచిన ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బి.యాదయ్య, కానిస్టేబుల్ ఎ.యాదయ్యలను మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ జానకి ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఏఎస్పీ రాములు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన డి.జానకిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు లింగంనాయక్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీసెల్ పట్టణ అధ్యక్షుడు పాత్లవత్ రవినాయక్, మోహన్‌లాల్‌నాయక్, శివనాయక్, హరినాయక్, జానునాయక్, భజన్ నాయక్, మల్లేష్ నాయక్, రమేష్‌నాయక్, అంగూర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన రెడ్‌క్రాస్ ప్రతినిధులు..

ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న జానకిని మంగళవారం కార్యాలయంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, డాక్టర్ శ్యాముల్, జగపతిరావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి



అడ్డాకులలో రైతుబీమా చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. రైతు భరోసా పథకం అమలు కోసం రైతుల అభిప్రాయ సేకరణ కోసం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి నిర్వహించిన కార్యక్రమాన్ని అడ్డాకుల రైతు వేదికలో మంగవారం జరిగిన వీసీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రైతుల రుణాలను మాఫీ చేయాలని నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. రైతు భరోసా ద్వారా రైతులకు మేలు చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని చెప్పారు. అనంతరం రైతు వేదిక వద్ద ముగ్గురు రైతుల కుటుంబాలకు మంజూరైన రైతు బీమా చెక్కులు, 18 మందికి కల్యాణలక్ష్మీ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం వర్నె వద్ద వాగులో బ్రిడ్జి నిర్మాణానికి అడ్డంకిగా మారిన భూసేకరణపై ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. బ్రిడ్జి నిర్మాణం వద్ద భూమి కోల్పోయే రైతుకు మరో చోట భూమి కేటాయించే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీఏ యశ్వంత్‌రావు, తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్, ఏఓ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ రాధిక, తోట శ్రీహరి, అరవింద్‌కుమార్‌రెడ్డి, నాగిరెడ్డి, విజయమోహన్ రెడ్డి, భీమన్నయాదవ్, షఫి తదితరులు పాల్గొన్నారు.

కోజెంట్ సేవలు అభినందనీయం..

చిన్నచింతకుంట: కోజెంట్ కంపెనీ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దమగ్నాపురంలో కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కంపెని ప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం



శేషాద్రినగర్‌లో డ్రెయినేజీ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 21వ వార్డు పరిధిలోని శేషాద్రినగర్‌లో రూ.పది లక్షలతో చేపట్టే డ్రెయినేజీ పనులను మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం కొత్తబస్టాండు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అక్కడి ప్రాంగణంలో నుంచి వెళ్లే వరద కాల్వను చూసి మురుగుతో పాటు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఎంఈ బస్వరాజ్, ఏఈ వైష్ణవి, ఆర్టీసీ డీఎం సుజాత తదితరులు పాల్గొన్నారు.

మాదిగ, ఉప కులాలకు అన్యాయం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ చేయకపోవడం వల్ల మాదిగ, ఉప కులాల వారికి విద్య, వైద్య, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో తీవ్ర అన్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. జూలై 7న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగే దండోరా రజతోత్సవాల కరపత్రాలు మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ సాధన ఉద్యమం ప్రారంభించిన మాదిగలు పోరాటాలు చేస్తూ ఎంతో మంది మాదిగలు అమరులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జయమ్మ, కృష్ణ, ఎల్లప్ప, రవి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలం స్వాధీనం



బోర్డును ఏర్పాటు చేయించిన రెవెన్యూ అధికారులు

రాజాపూర్: మండల పరిధిలోని ఉడిత్యాలలో గౌడ కులస్తులకు చెందిన శ్మశానాన్ని వెంచర్‌కు అడ్డుకు ఉందని తొమ్మిది గుంటల స్థలాన్ని సమాధులను సైతం తొలగించి కబ్జా చేశారు. విషయంపై రెవెన్యూ అధికారుల దృష్టికి గౌడ కులస్తులు తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారుల చొరవతో మంగళవారం బాలానగర్ మండల రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శి ఉషాకిరణ్ గ్రామ శివారులో ఉన్న శ్మశానవాటికను గుర్తించి స్థలంలో బోర్డును ఏర్పాటు చేశారు.

రోజు వారి కూలి ఇవ్వాలి

జీడీసెంటర్(మహబూబ్‌నగర్): తాము చేసిన పనికి అదే రోజు కూలి చెల్లించాలని ప్రగతి శీల సమాజ్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ అన్నారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రైతుల మేలు కోసం రైతుబంధు ప్రభుత్వం అమలు చేస్తున్నా, అధికారులు నిర్లక్ష్యం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు తప్పిదాల వల్ల డబ్బులు రైతుల ఖాతాలో జమ కాకుండా పోతున్నాయని తెలిపారు. ఈ విషయమై సీఎం స్పందించిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో అహ్మద్‌ఖాన్, అనిల్‌కుమార్, ఫయాజ్ అహ్మద్, రుద్రారెడ్డి, దీపక్, రుద్రప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.